ఈనాడు ములుగు
బుధవారం అక్టోబరు 2, 2024

డిజిటల్ కార్డు అమలుపై సమీక్ష

ములుగు, న్యూస్‌టుడే: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల అమలుపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల పాలనాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి టీఎస్. దివాకర, అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, జి.సంపత్‌రావు పాల్గొన్నారు. రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం, రెండు పడక గదుల ఇళ్లు, సన్నవడ్ల కొనుగోలు తదితర అంశాలపై చర్చించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దివాకర, అదనపు కలెకర్లు

రేపటి నుంచి దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు

ములుగు, న్యూస్‌టుడే: దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ములుగు పట్టణంలోని రామాలయ ప్రాంగణంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అక్టోబర్ 3 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండగా, దుర్గా శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దాదాపుగా ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. దుర్గామాతను ప్రతిష్ఠించేందుకు ప్రత్యేక అలంకరణతో మండపం, స్వాగత తోరణం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదిక, నిత్యాన్నదానం కోసం సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 12 వరకు దుర్గామాత వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.


ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

మహాత్ముడి మాట.. పూలబాట!



● పల్లెలు మురవాలి.. గాంధీజీ ఆశయం నెరవేరాలి ఉయ్యాలో..

ఈనాడు, వరంగల్, కాజీపేట, న్యూస్‌టుడే

మనిషి అవసరాలను తీర్చడానికి తగినంత భూమి ఉంది కానీ మనిషి దురాశను తీర్చడానికి సరిపోదు..

బుద్ధి వికాసానికి అనువైన చోట్లు పల్లెసీమలే.. పట్టణాలు నగరాలు కానే కావు.

ఎక్కడ ప్రేమ ఉందో అక్కడ దేవుడు ఉన్నాడు..



గ్రామాల అభివృద్ధి కోసం మహాత్ముడు కలలు కన్నారు.. పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలని తపించారు. గొప్ప వ్యక్తిత్వానికి మారుపేరుగా నిలిచిన ఆయన బోధనలు బతుకమ్మ పండగలోనూ కనిపిస్తాయి.. బతుకమ్మ అంటే జీవిత పండగ అని అర్థం. నిత్యం పంటలతో సుభిక్షంగా ఉంటూ వేడుకలా సాగాలని పార్వతీదేవిని మహిళలు వేడుకుంటారు. గాంధీ కోరుకున్నదీ పల్లెలు పచ్చగా ఉండాలనే. అందుకే బతుకమ్మ పండగలో గాంధీ ఆశయాలు కనిపిస్తాయి. అక్టోబరు 2 గాంధీ జయంతి.. మరో వైపు వైభవంగా జరిగే బతుకమ్మ పండగ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మహాత్ముడి ఆశయ సాధనలో ఆదర్శంగా నిలుస్తున్న ప్రకృతి పల్లెల గురించి కథనం..

ఆరుగుంటుపల్లి.. పారిశుద్ధ్యంలో ఆదర్శం

ఇంకుడుగుంతల నిర్మాణంలో ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఆరుగుంటుపల్లి గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామంలో 125 మంది జనాభా ఉండగా, 38 నివాసాలున్నాయి. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత నిర్మించుకోవడంతో.. గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి వేసవిలో కూడా నీటి సమస్య రాలేదని స్థానికులు చెబుతున్నారు. ఎస్సై కిరణ్‌కుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఉపాధి హామీ పథకం ఏపీవో భవాని గ్రామస్థులకు సహకరించడంతో పరిశుభ్రతలో, వందశాతం ఇంకుడు గుంతలు నిర్మించుకున్న గ్రామంగా ఆరుగుంటపల్లి నిలిచింది. –న్యూస్‌టుడే, వాజేడు





రాణా మెట్లెక్కని.. మెట్లతిమ్మాపురం

పది దశాబ్దాల చరిత్ర గల ఆదివాసీగూడెం.. సత్యం.. ధర్మం అనే గాంధీజీ సిద్ధాంతాలతో ముందుకు సాగుతోంది. ఊరిలో ఎవరి మధ్యనైనా గొడవ.. ఘర్షణ జరిగితే పరిష్కారం కోసం ఇప్పటి వరకు ఠాణా మెట్లెక్కలేదు. ఎలాంటి సమస్యలు వచ్చినా గ్రామంలోని పెద్దలు చర్చించి సామరస్యంగా పరిష్కరిస్తారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రానికి 15 కి.మీ దూరంలోని అడవి మధ్యన ఉన్న **మెట్లతిమ్మాపురం** ప్రత్యేకత ఇది.. 130 కుటుంబాలు, 750 మంది జనాభా 412 మంది ఓట్లు కలిగిన ఈ గూడెం ప్రజల్లో కల్మషం, విద్వేషాలు ఏమాత్రం కనిపించవు. కలిసిమెలిసి జీవనం కొనసాగిస్తున్నారు. 'సమస్య పరిష్కారానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా.. గ్రామ పెద్దల మధ్యనైనా ఎక్కడైనా జరిగేది న్యాయమే. అందుకే గ్రామ పరువును కాపాడుకునేందుకు స్టేషన్‌కు వెళ్లకుండా ఇరువర్గాల వారు తీర్పును మెచ్చేలా పెద్దల సమక్షంలోనే పరిష్కరించుకుంటున్నాం. ఇది మా పూర్వీకుల నుంచి కొనసాగుతోంది. భవిష్యత్తులోనూ ఇదే విధానాన్ని కొనసాగిస్తాం అని ఊరి దొర బిజ్జ నర్సింహారావు, పటేల్ తాటి కృష్ణ వివరించారు.

● వ్యవసాయంపైనే ఆధారపడిన వీరు ఎక్కువగా వరి, మొక్కజొన్న, మిర్చి పంటలను సాగు చేస్తారు. వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. మురుగునీరు వీధుల్లో పారకుండా ఇంటింటా ఇంకుడు గుంతలను నిర్మించుకుని స్వచ్ఛతలో శెభాష్ అనిపించుకుంటున్నారు.

● గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన వ్యక్తులున్నా ఎక్కడా ఏ పార్టీ జెండాలు, సూపాలు, విగ్రహాలు, ఫ్లెక్సీలు కనిపించవు. సుమారు 15 ఏళ్ల నుంచి మద్యపాన నిషేధం అమలు చేస్తున్నారు. అమ్మకాలు చేస్తే రూ.10 వేల జరిమానా విధిస్తున్నారు.

అన్నింట్లో ఆదర్శం

గూడెం ప్రజలు వేలిముద్రలు వేయకూడదనే ఉద్దేశంతో సుమారు 32 ఏళ్ల కిందటనే అప్పటి పెద్ద రామయ్య కనీసం వారందరూ పేర్లు రాసేలా.. బస్సుల పేర్లు తెలిసేలా అక్షరాలు నేర్పించారు. ఆ తర్వాత అక్షరదీపం కార్యక్రమం కింద రాత్రిబడిలో ప్రతి ఒక్కరూ అక్షరాలు నేర్చుకొని 2005లో నాటి భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రశంసలు పొందారు.

● గ్రామస్థుల కోసం అభయ, 100 స్మైల్ ఫౌండేషన్ సహకారంతో గ్రంథాలయం ఏర్పాటు చేసినా కొత్తపుస్తకాలు ఇచ్చే వారు లేరు.

● డిగ్రీ, పీజీ, బీఈడీ, ఇంజినీరింగ్ చదివినవారు 45 మంది వరకు ఉన్నారు. టీచర్లు 13 మంది ఉన్నా ఇందులో పెళ్లి చేసుకొని అత్తారింటికి వెళ్లిన అమ్మాయిలున్నారు. పోలీస్, అటవీ శాఖ ఉద్యోగులు నలుగురున్నారు. ఇందులో ఒకరు మహిళా రిజర్వుడు ఎస్ఐ ఉన్నారు.

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, బయ్యారం

ఆ రెండు గ్రామాల్లో సంపూర్ణ మద్యనిషేధం


గంగదేవిపల్లి

గీసుకొండ: సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలు చేస్తూ ఆ రెండు గ్రామాలు గాంధీజీ కలలను నిజం చేశాయి. అవే వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లి, మరియపురం గ్రామాలు. గంగదేవిపల్లి ఇరవై ఏళ్ల క్రితమే జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామంగా ఎంపికవగా మరియపురం మూడేళ్ల కిందట ఆ స్థానం సంపాదించింది. గంగదేవిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూసం రాజమౌళి నేతృత్వంలో 40 ఏళ్ల కిందటే ఇక్కడి ప్రజలు సారాపై ఉద్యమించి విజయం సాధించారు.

మద్యం విక్రయాలకు చోటు లేదు


అంకన్నగూడెం

అది ఓ కుగ్రామం. అక్కడ నివసించేవారంతా ఆదివాసీ గిరిజనులే. మద్యం కారణంగా ఆర్థికంగా, శారీరకంగా నష్టపోతున్నామని గ్రహించి గ్రామంలో మద్యాన్ని నిషేధించారు. ములుగు మండలం అంకన్నగూడెం గ్రామంలో సుమారు 110 కుటుంబాలుండగా, వీరి జీవనాధారం వ్యవసాయం. ఇక్కడ రెండు మద్యం దుకాణాలుండగా, గ్రామానికి చెందిన కొందరు నిత్యం మత్తులో కుటుంబ సభ్యులతో గొడవలు పడేవారు. గ్రామస్థులంతా 2018లో ఓ నిర్ణయానికి వచ్చి గ్రామంలో మద్యం విక్రయాలు నిషేధించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ గ్రామంలో మద్యంకు చోటు లేదు. ఈ గ్రామానికి చెందిన జిల్లా వైద్యాధికారి అప్పయ్య గ్రామస్థులను పోగు చేసి మద్యం విక్రయాల్లేకుండా చేయడంలో కీలకపాత్ర పోషించారు. – న్యూస్‌టుడే, ములుగు

ఐక్యతోనే దళితుల బలోపేతం


నినాదాలు చేస్తున్న మాలల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ శివకుమార్, శ్రేణులు

వెంకటాపురం, న్యూస్‌టుడే: ఐక్యంగా ఉంటేనే దళితులు అన్నిరంగాల్లో బలోపేతం చెందుతారని మాలల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ గంపల శివకుమార్ అన్నారు. వెంకటాపురం మండల కేంద్రంలో మంగళవారం సాధనపల్లి చిట్టిబాబు అధ్యక్షతన ఐక్య వేదిక సమావేశం జరిగింది. ఎస్సీల వర్గీకరణ చేయాలనే ఆలోచన రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ ప్రక్రియపై సుప్రీం కోర్టు పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. దళితుల మధ్య చిచ్చు పెట్టేందుకే వర్గీకరణకు తెరలేపారని, క్రిమిలేయర్ ముసుగులో రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితులంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. జనాభా దమాషా పద్ధతిలో రిజర్వేషన్లను పెంచాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, అసైన్మెంట్ భూములను ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేయాలన్నారు. ప్రత్యేక కార్యాచరణతో వెనకబడిన ఎస్సీల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. మాలలను చైతన్యవంతం చేసేందుకు ఈ నెల 25 నుంచి గ్రామ స్థాయిలో పాదయాత్రలను చేపట్టనున్నట్లు ప్రకటించారు. అనంతనం నూతన అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కో కన్వీనర్‌గా సాధనపల్లి చిట్టిబాబు, అధ్యక్షుడిగా మంచాల భూషణం, కార్యదర్శిగా భరత్‌కళ్యాణ్, సభ్యులుగా లకుమల్ల మోహన్‌రావు, సంగం విద్యాసాగర్, నంది వెంకటేశ్వర్లను నియమించారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ గోగులమూడి హరికృష్ణ, నాయకులు సుందర్‌రావు, ఎండీ కృష్టియన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

కాటారం, మహాదేవపూర్ న్యూస్‌టుడే: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాటారం డివిజన్‌లో బుధవారం పర్యటించనున్నారు. కాటారం-భూపాలపల్లి జాతీయ రహదారి మార్గంలో, మహదేవపూర్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసే ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించనున్నారు. కాటారం మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొననున్నారు.

'కాంగ్రెస్‌వి సాధ్యపడని హామీలు'


ప్రసంగిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం

మంగపేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని భాజపా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. మంగళవారం మంగపేట మండల కేంద్రంలో నిర్వహించిన భాజపా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలు నెరవేరుస్తానని చెప్పిందన్నారు. రైతు బంధు, రైతు భరోసా, రైతు రుణమాఫీ అమలు చేయకపోగా, సాధ్యపడని హామీలతో ప్రజలను మోసం చేస్తుందన్నారు. రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. భాజపా కార్యకర్తలు ప్రతి బూత్‌లో 200 సభ్యత్వాలు పూర్తి చేసే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో భాజపా గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి భర్తపురం నరేష్, అసెంబ్లీ కన్వీనర్ జాడి వెంకట్, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్, జిల్లా కార్యదర్శులు రుద్రాపు సురేష్, శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు లోడె శ్రీనివాస్, జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షలు ఎండి. యాకూబ్‌పాషా, మండల ప్రధాన కార్యదర్శి రాంఖీ, మండల కార్యదర్శులు బొల్లికొండ సాంబయ్య, చీకట్ల యాకస్వామి, నిడదవోలు శ్రీనివాస్, రాంటెంకి సమ్మయ్య, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి ఎంబటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సేవలకు ట్రాఫిక్ కష్టాలు



వెంకటాపురం మండల కేంద్రంలోని వాజేడు మార్గంలో రహదారిపై ఇసుక లారీ నిలిచిపోయింది. నిల్వలతో హైదరాబాద్‌కు వెళ్తున్న ఈ వాహనం అర్థాంతరంగా మరమ్మతులకు గురవ్వడంతో మంగళవారం రోడ్డుపైనే ఆగింది. ఈ క్రమంలో ఇరువైపులా ట్రాఫిక్ సమస్య తలెత్తింది. మూగజీవాలు సైతం ఇదే మార్గంలో పెద్దఎత్తున రావడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వెంకటాపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సేవలు పొందుతున్న డెంగీ బాధితుడిని ములుగుకు 108 వాహనంలో తరలిస్తుండగా ట్రాఫిక్‌లో చిక్కుకుంది. 15 నిమిషాల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. మూగజీవాలు వెళ్లే వరకు ట్రాఫిక్ పునరుద్ధరణ జరగలేదు. రాత్రి సైతం మరమ్మతులకు గురైన వాహనం రోడ్డుపైనే ఉంది. – న్యూస్‌టుడే, వెంకటాపురం

వైకుంఠధామానికి వెళ్లే దారి ఇదే..



ఏటూరునాగారం మండలంలోని అల్లంవారిఘనపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వైకుంఠధామానికి వెళ్లే దారి బురదమయంగా మారింది. సరైన మార్గం ఏర్పాటు చేయకపోవడంతో చిన్న వర్షం పడినా.. చిత్తడిగా తయారవుతోంది. ఈ ప్రాంతంలోని పంట పొలాలకు వెళ్లే కర్షకులు, అంతిమ యాత్రకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ వైకుంఠధామం చుట్టూ వేసిన కంచె కూడా కనిపించకుండా పోయింది. ఇక్కడ ఏర్పాటు చేసిన చేతి పంపు కూడా నిరుపయోగంగా ఉంది. స్నానాల కోసం ఏర్పాటు చేసిన రెండు గదులు రేకులు ధ్వంసమయ్యాయి. దారి బాగు కోసం పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కన్నాయిగూడెం

ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ చేయాలని సీఎంను కోరతాం..


ములుగులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐకాస వ్యవస్థాపకుడు పిడమర్తి రవి

ములుగు, న్యూస్‌టుడే: మాదిగ ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల మేలుకొలుపు యాత్ర మంగళవారం ములుగు పట్టణానికి చేరుకుంది. ఐకాస వ్యవస్థాపకుడు పిడమర్తి రవి ఆధ్వర్యంలో చేపట్టిన యాత్రకు ములుగులో మాదిగలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. జిల్లాలను యూనిట్‌గా తీసుకొని జనాభా ఎంత ఉంటే అంత వాటా దక్కాలన్నారు. 12 శాతం రిజర్వేషన్ అనేది ప్రతి పల్లెను తాకిందని, త్వరలోనే సీఎంను కలిసి ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ చేయాలని కోరనున్నట్లు తెలిపారు. తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న మాదిగలు ఎంతో వెనుకబడి ఉన్నారని, రిజర్వేషన్ అమలుకు కలిసి వచ్చే సంఘాలతో భవిష్యత్తులో ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ముదిరాజ్, యాదవ, ముస్లింలకు ప్రాధాన్యం అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ కోడారి ధీరణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండమీది గోవిందరావు, టీఎండీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల మల్లికార్జున్, ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మైస ఉపేందర్, మాదిగ యూత్ ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్, నాయకులు మహేష్, రమేష్, శీను, నవీన్, ప్రదీప్, అంజి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ.. ప్రయాణం భారం!
వివరాలు 8లో...

దివ్యాంగుల హక్కుల సాధనకు ఉద్యమం

మహబూబాబాద్ న్యూస్‌టుడే: దివ్యాంగులు తమ హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెర్కొని రాజు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో నిర్వహించిన దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 25,26,27 తేదీల్లో సంఘం 4వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తాగునీటి వృథాను నిలువరించాలి


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో పనిచేసే తాగునీటి సరఫరా సహాయకులు అంకితభావంతో పనిచేయాలని గ్రామీణ తాగునీటి సరఫరా ఎస్ఈ మల్లేశం సూచించారు. గోవిందరావుపేట మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం తాగునీటి సరఫరా సహాయకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పనిచేసే సహాయకులు స్థానిక పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఉన్న తాగునీటి వనరులైన ట్యాంకులకు సంబంధించిన పైపులైన్ల లీకేజీలు గుర్తించి అధికారులకు సమాచారం అందించాలన్నారు. అదేవిధంగా చేతిపంపులు, విద్యుత్తు మోటార్లలో ఎదురయ్యే సమస్యలు సైతం త్వరితగతిన గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జవహర్‌రెడ్డి, ఎంపీవో శరత్ బాబు, డీఈఈలు సునిత, సతీష్, ఏఈఈ హరిక తదితరులు పాల్గొన్నారు.

అతివలకు వరం 'ఆరోగ్య మహిళ'

వెంకటాపూర్, న్యూస్‌టుడే: జిల్లాలోని మహిళలకు ప్రత్యేకమైన వైద్య సేవలు అందించడం కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాలు అతివలకు వరమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య అన్నారు. మంగళవారం వెంకటాపూర్ మండల కేంద్రంలోని 'ఆరోగ్య మహిళ' క్లినిక్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బంది హాజరు, ఓపీ, మందుల నిల్వల రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులు, మహిళలతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట వైద్యులు రిషిత, చందన, ఫార్మసిస్టు రాజమణి, స్టాఫ్ నర్సు మునమ్మ తదితరులు ఉన్నారు.


వైద్యులకు సూచనలిస్తున్న జిల్లా వైద్యాధికారి అప్పయ్య

పండగ వేళ.. ప్రయాణం భారం!

రైళ్ల రద్దు.. బస్సుల్లో రద్దీ

బతుకమ్మ పండగ వచ్చిందంటే ఆడపడుచులు వారి తల్లిగారింటికి బయలుదేరుతారు. పాఠశాలలకు మంగళవారం నుంచి సెలవులు ప్రకటించడంతో పిల్లలతో ఎంత కష్టమైనా సొంతింటికి వెళతారు. ఓరుగల్లు ప్రజలు ఎక్కువగారైళ్లలో ప్రయాణిస్తారు. ఈసారి పండగకు విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. మూడోలైను పనుల కారణంగా వరంగల్, కాజీపేట నుంచి వెళ్లే రైళ్లను ఈ నెల 7 వరకు రద్దు చేశారు. ప్రత్యేక రైళ్లను ప్రకటించినా వాటిలో చాలా వరకు రద్దయ్యాయి. దీంతో అందరూ బస్సులనే ఆశ్రయించాల్సి వస్తోంది. బతుకమ్మ, దసరా పండగకు వరంగల్ ఆర్టీసీ అదనపు బస్సులను మంగళవారం నుంచి నడిపిస్తోంది. రైలు ప్రయాణికులంతా వాటినే ఆశ్రయిస్తారు కాబట్టి రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో కొందరు సొంత వాహనాల్లో పయనం కావడానికి సిద్ధమవుతున్నారు. చౌకగా ప్రయాణం చేసే రైళ్లు రద్దు కావడం అందరికీ భారంగా మారింది..

-కాజీపేట, హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే


రైళ్లు రద్దు కావడంతో వెల వెల పోతున్న కాజీపేట రైల్వే స్టేషన్

బస్సు	ఛార్జీల వివరాలు (రూ.)	రైలు
300	వరంగల్-హైదరాబాదుకు	80
275	వరంగల్-ఖమ్మం	75
250	వరంగల్-రామగుండం	70


ప్రయాణికులతో కిక్కిరిసి ఉన్న హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్



అదనపు భారం రూ.2 వేలు

రైళ్లు లేకపోవడంతో ఈసారి బస్సు ప్రయాణం తప్పదు. వాటిలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉన్నా రద్దీని తట్టుకోవడం కష్టం. దీంతో ఛార్జీలు అధికంగా ఉండే డీలక్స్, సూపర్ లగ్జరీ వంటి ఉన్నత స్థాయి బస్సులను ఆశ్రయించాల్సిందే. వాటిలోనూ సీట్లు దొరకడం కష్టం.

ఇదీ పరిస్థితి: ఇంట్లో నలుగురు వ్యక్తులు హైదరాబాద్ నుంచి వరంగల్‌కు ప్రయాణం చేయాలనుకుంటే రైలు ఛార్జీతో పోలిస్తే ఒక్కొక్కరికి బస్సులో రూ.200 నుంచి రూ.225 వరకు ఎక్కువ అవుతుంది. దీనికి తోడు ఆటోలు, ఇతర రవాణా ఛార్జీలు కలుపుకొని కుటుంబానికి రానుపోను రూ.2000 వరకు అదనపు భారం పడుతుంది.

ముందస్తు ప్రయాణం మేలు

పండగకు ముందురోజు కంటే ఒకటి, రెండు రోజుల ముందే ప్రయాణం కడితే కొంత రద్దీని తట్టుకోవచ్చు. చాలా మంది సాయంత్రం విధులు ముగించాక బయలుదేరుతారు. కాస్త ముందుగా బయలుదేరితే ఆర్టీసీకి కాస్త వెసులుబాటు లభిస్తుంది.

● ఇప్పుడు చాలా మందికి కార్లు ఉంటున్నాయి. కాబట్టి కాస్త ఖర్చు ఎక్కువైనా కారు లేదా ఇతర వాహనాలు వాడితే సామాన్య ప్రజలకు బస్సుల్లో కాస్త వెసులుబాటు ఉంటుంది.

ట్రిప్పుల సంఖ్య పెంచాలి..

-మాడిశెట్టి చంద్రశేఖర్, హనుమకొండ



గతంలో రైళ్లలో ప్రయాణించేవాళ్లం.. ఈసారి అవి రద్దయ్యాయి. దీనితో బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశం ఉంది. రెళ్లు నడిచే మార్గంలో ఆర్టీసీ బస్సులు ఎక్కువగా నడిపించాలి. ట్రిప్పుల సంఖ్య పెంచాలి. రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయాలి.

అదనపు భారం

-గద్దల సతీష్, ప్రయాణికుడు



మా స్వగ్రామం మంచిర్యాల దేవనూరు. మా బంధువులు అంతా అక్కడే ఉంటారు. మేము హనుమకొండకు వచ్చి దాదాపు 15 ఏళ్లు అవుతోంది. అప్పుడప్పుడు మా గ్రామానికి వెళ్లి వస్తుంటాం. ఈ ఏడాది దసరాకు వెళ్దామని అన్నీ సిద్ధం చేసుకున్నాం. ఇంతలోనే రైళ్లు రద్దు అని చెబుతున్నారు. బస్సులో వెళ్తే ప్రయాణ భారంతో పాటు సమయం ఎక్కువగా తీసుకుంటుంది. ఈ సమయంలో రైళ్లు రద్దు చేయడం సరికాదు.. పండగలు ముగిసిన తర్వాత ఆ నిర్ణయం తీసుకుంటే బాగుండేది

బల్లార్ష మార్గంలో బహుకష్టం

బల్లార్ష మార్గంలో పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల ప్రాంతాలకు వెళ్లడానికి రైలు మార్గమే సులువు.. చౌకగా వెళ్లొచ్చు. రైళ్లు రద్దు చేయడంతో కరీంనగర్ మీదుగా బస్సులో వ్యయప్రయాసలతో ప్రయాణించాల్సిందే.

నిండిన బెర్తులు: దసరా పండగకు కోల్‌కతా, ఒడిశా, బెంగళూరు, మైసూరు, తిరుపతి ప్రాంతాలకు ఎక్కువగా వెళుతుంటారు. ఈమార్గంలో రైళ్లకు చాంతాండంత వెయిటింగ్ లిస్టు ఉంది. హౌరా, యశ్వంతాపూర్, పద్మావతి రైళ్లలో బెర్తులు లేవని చూపిస్తున్నాయి.

గతేడాది అక్టోబరులో దసరా, బతుకమ్మ పండగ నేపథ్యంలో వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల నుంచి ప్రయాణించినవారి సంఖ్య (రోజుకు సగటున)

మార్గం	ప్రయాణికుల సంఖ్య	సాధారణ రోజుల్లో ప్రయాణికుల సంఖ్య	తేడా
వరంగల్-కాజీపేట- సికింద్రాబాద్	16,000	9,500	6,500
కాజీపేట-వరంగల్- ఖమ్మం	13,000	8,500	4,500
కాజీపేట - వరంగల్- బల్లార్ష	15,000	6,500	7,500

● మార్గం ● ప్రయాణికుల సంఖ్య ● సాధారణ రోజుల్లో ప్రయాణికుల సంఖ్య ● తేడా

ప్రైవేటు వాహనాలకు గిరాకీ



ప్రైవేటు వాహనాలకు గిరాకీ బాగా పెరిగింది. ఇప్పటికే వరంగల్‌లోని ట్రావెల్స్‌లో ఉన్న నాలుగు చక్రాల వాహనాలు బతుకమ్మకు ముందు రోజున బుక్ అయ్యాయి. డిమాండ్ పెరగడంతో ఆ రోజు ప్రయాణానికి అదనంగా వసూలు చేయనున్నారు.

నేటి నుంచి 850 అదనపు బస్సులు..

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: వరంగల్ రీజియన్‌లో 850 బస్సులను (ట్రిప్పులు) నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఎక్కువగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలకు తిరుగుతాయి. దూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులను ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఈ నెల 2 నుంచి 8 వరకు ఇవి నడుస్తాయి. పండగ అనంతరం తిరుగు ప్రయాణంలో భాగంగా 13, 14, 15 తేదీల్లో రద్దీకి అనుగుణంగా ఆయా డిపోల నుంచి హైదరాబాద్‌కు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు సైతం బస్సులు నడపనున్నారు. సాధారణ ఛార్జీలే వసూలు చేస్తామని అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకం అమలులో ఉండటంతో గతేడాది కంటే అదనంగా బస్సులను నడిపిస్తున్నామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు.

● హనుమకొండ బస్టాండు నుంచి హైదరాబాద్ రూట్లో నిత్యం 250 బస్సులు నడుస్తుంటాయి..దాదాపు 400 ట్రిప్పులు. పండగ సందర్భంగా అదనంగా 150 బస్సులు నడిపిస్తారు.. ● ఖమ్మం, మహబూబాబాద్ రూట్లలో వరంగల్ రీజియన్ నుంచి హనుమకొండ, మహబూబాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు నడుస్తాయి. 25 బస్సులు ఖమ్మం వరకు ఉంటాయి. మహబూబాబాద్ నుంచి ఖమ్మం వరకు మరికొన్ని బస్సులు నిత్యం నడుస్తాయి. ఈ మార్గంలో అదనంగా మరో 50 బస్సులను పెంచనున్నారు.

డిపోల వారీగా నడిపే ప్రత్యేక బస్సులు

డిపో	బస్సులు
వరంగల్-1	125
వరంగల్-2	125
హనుమకొండ	125
పరకాల	93
నర్సంపేట	119
జనగామ	120
తొర్రూరు	48
మహబూబాబాద్	47
భూపాలపల్లి	48

రేపటి నుంచి శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రులు

● 10న సద్దుల బతుకమ్మ.. 12న దసరా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు

రంగంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రులు ఈ నెల 3వ తేదీ నుంచి 13 వరకు వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు కార్యనిర్వహణ అధికారిణి శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు వెల్లడించారు. 10న మహానవి(దుర్గాష్టమి) శ్రీభద్రకాళి జన్మోత్సవం, సద్దుల బతుకమ్మ, 12న విజయదశమి(దసరా) ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఉత్సవాల వివరాలు వెల్లడించారు. శ్రీదేవి శరన్నవరాత్రులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని, తొమ్మిది రోజులపాటు తొమ్మిది రూపాల్లో అమ్మవారిని సుందరంగా అలంకరిస్తారని, ఉదయం, సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తులకు వాహన సేవలుంటాయన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్, చింత శ్యాంసుందర్, అర్చకుడు గండికోట రాము తదితరులు పాల్గొన్నారు.

రోజు వారీగా కార్యక్రమాలు..

● 2న ఉదయం హరిద్రాదర్శనం శరన్నవరాత్రయాగ పూర్వాంగనిధి, సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ
● 3న భేరి పూజ, ధ్వజారోహణం, కలశ స్థాపన, అమ్మవారిని శైలపుత్రిక్రమము బాలా త్రిపురసుందరి అలంకరణ, ఉదయం 11 గంటలకు వృషభ వాహనసేవ, సాయంత్రం మృగ(జింక) వాహనసేవ
● 4న అన్నపూర్ణాలంకారం, బ్రహ్మచారిణి దుర్గార్చన, మకర, చంద్రప్రభ వాహనసేవలు
● 5న గాయత్రి అలంకరణ, చంద్రఘంటా దుర్గార్చన, సింహ, గజ వాహనసేవలు
● 6న శ్రీమహాలక్ష్మి అలంకరణ, కూష్మాండీ దుర్గార్చన, సూర్యప్రభ, హంస వాహనసేవలు
● 7న లలితా పంచమి శ్రీరాజరాజేశ్వరి లలితా మహాత్రిపుర సుందరి, స్కందమాత దుర్గార్చన, పల్లకీ సేవ, శేషవాహనసేవ
● 8న భవాని అలంకరణ, కాత్యాయని దుర్గార్చన, గంధోత్సవం, చాముండ దుర్గార్చన, సాలభంజిక సేవ
● 9న శ్రీ సరస్వతీమాత, కాళరాత్రి దుర్గార్చన, రాత్రి అమ్మవారికి రథోత్సవం
● 10న మహాష్టమి(దుర్గాష్టమి) శ్రీభద్రకాళి అమ్మవారి జన్మోత్సవం, మహా దుర్గా అలంకారం, మహా గౌరి దుర్గార్చన, భద్రపీఠ సేవ, అశ్వవాహన సేవ, సద్దుల బతుకమ్మ
● 11న మహా నవమి మహిషమర్దిని అలంకరణ, శుంభ దుర్గార్చన, వసంతోత్సవం, మహా పూర్ణాహుతి, సాయంత్రం సర్వభూపాల వాహనసేవ
● 12న విజయ దశమి, శమీ పూజ, శ్రీభద్రకాళి అమ్మవారికి మహా పట్టాభిషేకం, నిజరూప దర్శనం, రాత్రి భద్రకాళి చెరువు(తటాకంలో)లో శ్రీభద్రకాళి భద్రేశ్వరులకు తెప్పోత్సవం
● 13న సాయంత్రం శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణం.

రూపుదిద్దుకుంటున్న కాజీపేట వంతెన

ఈనాడు, వరంగల్, కాజీపేట, న్యూస్‌టుడే

● రాయ్‌పూర్‌లో సిద్ధమవుతున్న 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'

కాజీపేట వద్ద నిర్మాణంలో ఉన్న రెండో ఆర్వోబీపై బిగించేందుకు ఉక్కుతో తయారు చేస్తున్న 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో సిద్ధమవుతోంది. నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈనెలాఖరుకు విడిభాగాలు ఇక్కడకు తీసుకొస్తారు. విల్లు ఆకారంలో ఉక్కుతో ఉన్న ఈ భాగాన్ని రైల్వే పట్టాలపై నిపుణులు బిగించనున్నారు. రాష్ట్రంలో ఇలాంటి తరహా వంతెన ఇప్పటి వరకు ఎక్కడా లేదని.. కాజీపేటపై రెండో ఆర్వోబీపై వచ్చేది మొదటిది అని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

● శంకుస్థాపన - 2017
● టెండర్లు పిలిచింది - 2019
● పూర్తి కావాల్సింది - 2020
● పనులు ప్రారంభమైంది - 2021
● మొత్తం అంచనా వ్యయం - రూ.45 కోట్లు
● 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' భాగం నిర్మాణానికి - రూ.20 కోట్లు
● వెడల్పు - 9.5 మీటర్లు
● ఎడమవైపు పాదచారుల దారి - 1.5 మీటర్లు.


తయారీ దశలో 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'

మరో రూ.16 కోట్లు విడుదల చేయాలి

ఈ వంతెనను వేంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్ అనే గుత్తేదారు సంస్థ నిర్మిస్తోంది. ఈ సంస్థకు ప్రభుత్వం ఇంకా రూ.16 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులతో సమీక్షించి ఈ నిధులను వెంటనే విడుదల చేయాలని చెప్పారు. మూడు నెలలు గడుస్తున్నా నిధులు ఇంకా గుత్తేదారుకు అందలేదని, అందుకే వంతెన నిర్మాణం నిలిచిపోయినట్లు సమాచారం. ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి నిధులను వెంటనే విడుదల చేస్తే పనులు వేగంగా పూర్తవుతాయి.

విల్లు ఆకారమే ప్రత్యేకం

కాజీపేటలో ఉన్న పాత ఆర్వోబీకి కొత్త వంతెన పూర్తి భిన్నంగా ఉంటుంది. దీన్ని 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' గా పిలుస్తారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. రైళ్ల రాకపోకలకు ఏమాత్రం అంతరాయం లేకుండా వంతెన నిర్మాణాన్ని కొనసాగించేందుకు ముందే సిద్ధం చేసిన 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'ను వంతెనపై బిగించనున్నారు. వంతెనను 21 స్తంభాలతో నిర్మిస్తుండగా, ఇందులో రైల్వే లైన్ల పైభాగంలో మాత్రం విల్లు ఆకారంలో ఉండే నిర్మాణం మొత్తం ఉక్కు మిశ్రమంతో ఉంటుంది. దీనికి ఆధారంగా మూడు పిల్లర్లు ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. రైల్వే పట్టాలపై 800 టన్నుల బరువుతో 250 అడుగుల పొడవుతో రెండు భాగాలు ఉంటాయి. అంటే మొత్తం 1600 టన్నుల బరువు, 500 అడుగుల పొడవుతో 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' భాగాలను రాయ్‌పూర్‌లో సిద్ధం చేస్తున్నారు. ఇటీవలే మన ఇంజినీర్లు అక్కడికి వెళ్లి దాన్ని పరిశీలించారు. 'ఈనాడు' ఆ చిత్రాలను ప్రత్యేకంగా సంపాదించింది. ప్రస్తుతం ఉన్న వంతెన కన్నా కొత్త వంతెన ఎక్కువ ఎత్తుతో ఉండనుంది.



కేయూలో విజిలెన్స్ విచారణ


కేయూ అధికారులను విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

విద్యానగర్,న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉప కులపతి టి.రమేష్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ ఎ.బాలకోటి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్‌లు జి.రాకేష్, బి.అనిల్, హస్నన్, ఎఫ్‌ఆర్‌ఓ గౌతమ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిప్రసాద్ తదితరులు కేయూకు వచ్చారు. రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, పరీక్షల నియంత్రణ అధికారులను విచారించారు. ప్రొఫెసర్లను సీనియర్ ప్రొఫెసర్లుగా ఏ విధంగా పదోన్నతి కల్పించారు.. సెలక్షన్ కమిటీ ఆమోద పత్రాలు, ఈసీ మినిట్స్, 2022లో పీహెచ్‌డీ ప్రవేశాలు ఎలా భర్తీ చేశారు.. తదితర అంశాలపై విచారించి, వాటికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడిగిన వివిధ పత్రాలు సమర్పించడంలో వర్సిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, రెండు మూడు సార్లు నోటీసులు పంపించినా వాటికి ఎలాంటి సమాధానాలు రాక పోవడంతోనే నేరుగా విచారణకు వచ్చినట్లు సమాచారం.

భారీ బతుకమ్మకు అంతర్జాతీయ రికార్డు


జనగామలోని నెహ్రూపార్కు సెయింట్‌మేరీస్ ఉన్నత పాఠశాలలో 36.2 అడుగుల భారీ బతుకమ్మ

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద ఉన్న సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. సంబరాల్లో భాగంగా 36.2 అడుగుల బతుకమ్మను తయారు చేసి ప్రపంచంలోకెల్లా అతి పెద్ద బతుకమ్మగా ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకుంది. స్టీల్, వైబ్రెంట్ ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్‌తో 700 మంది విద్యార్థులు, 30 మంది ఉపాధ్యాయులు కలిసి 24 గంటలలోపు దీన్ని తయారు చేశారు. ఇంతకు ముందు ఉన్న 31 అడుగుల బతుకమ్మ రికార్డును అధిగమించినందున ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు నరేందర్‌గౌడ్, సుభాషిని.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసాని శ్రీధర్‌కు సదరు రికార్డు ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు.



ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ధ్రువీకరణపత్రం

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	110
రిటైల్:	132
డ్రెస్డ్:	191
స్కిన్‌లెస్:	218

నఖ చిత్ర కళలో దిట్ట



దళసరి కాగితాలే క్యాన్వాస్‌గా వేలి గోర్లే కుంచెగా చేసుకుని అద్భుత కళాఖండాలు చిత్రీకరిస్తూ అబ్బురపరుస్తున్నారు నర్సంపేటకు చెందిన కళాకారుడు మండ వీరస్వామి. కవి, గేయరచయిత, గాయకుడు, చిత్రకారుడు, రంగస్థల నటుడిగానే గాక చిత్రలేఖనంలో చేయి తిరిగిన చిత్రకారుడు కూడా. చిత్రలేఖనంలో పట్టున్న ఆయన దళసరి కాగితాలపై నఖ(గోటి)తో మహాత్మాగాంధీ, మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం, మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు తదితరుల చిత్రాలు గీసి అబ్బురపరుస్తున్నారు. -న్యూస్‌టుడే, నర్సంపేట

5న ఉద్యోగ మేళా

కొత్తవాడ, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న వరంగల్ ములుగురోడ్డులోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో చెన్నైలోని హిందూస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్‌లో 100 ఉద్యోగ ఖాళీలకు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. ఇంటర్‌లో 75శాతం మార్కులు వచ్చి, 18 నుంచి 22 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబరు 75691 77071 సంప్రదించాలన్నారు.

చారిత్రక ప్రాంతాల సందర్శనే లక్ష్యం


బ్రోచర్ విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ జీఎం కిషోర్, ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగర్ తదితరులు

కాజీపేట, న్యూస్‌టుడే: రైలు ప్రయాణికులకు చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించపజేయడమే లక్ష్యంగా ఐఆర్‌సీటీసీ పని చేస్తుందని సంస్థ జనరల్ మేనేజర్ కిషోర్, టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ అన్నారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం భారత్ గౌరవ్ యాత్ర ప్రత్యేక పర్యాటక రైలుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. స్థానిక టూరిజం ఏజెంట్లకు దీనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారత్ గౌరవ్ యాత్ర మొత్తం 8 రాత్రులు, 9 పగళ్లు ఉంటుందని చెప్పారు. నవంబరు 6న సికింద్రాబాద్ నుంచి ఈ రైలు ప్రారంభమౌతుందని తెలిపారు. ఈ యాత్రలో రామేశ్వరం, అరుణాచలం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు తదితర సందర్శన ప్రదేశాలుంటాయన్నారు. ఆసక్తి ఉన్న ప్రయాణికులు వివరాలకు 92810 30749, 92810 30750 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పంచాయతీ భవనం పూర్తయ్యేనా..?



కన్నాయిగూడెం మండలంలోని కంతనపల్లి గ్రామ పంచాయతీ భవనం పూర్తి చేయడంతో గుత్తేదారు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రూ.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన పనులు దాదాపు పూర్తి కావచ్చిన దశలో నిధులు సరిపోలేదనే సాకు చూపుతూ నిలిపివేశారు. రంగులు వేయడం, విద్యుద్దీకరణ పనులు చేయాల్సి ఉంది. దీంతో అంగన్‌వాడీ సమీకృత భవనంలో పంచాయతీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి త్వరితగతిన పనులు పూర్తి చేసి పంచాయతీ భవనాన్ని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, కన్నాయిగూడెం

అవగాహనతోనే ప్రజారోగ్యానికి భరోసా



వాజేడులో సూచనలిస్తున్న వైద్యాధికారి మధుకర్



వెంకటాపురం మండలంలోని ఎదిర పీహెచ్‌సీ వద్ద

వాజేడు, న్యూస్‌టుడే: కాలనుగుణ వ్యాధులపై గ్రామస్థులు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు పేర్కొన్నారు. వైద్యశాఖ అమలు చేస్తున్న పథకాలపై పూర్తి అవగాహనతోనే ప్రజారోగ్యానికి భరోసా ఇవ్వగలమన్నారు. జిల్లాలో పలు చోట్ల 'ఆశ' కార్యకర్తలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మధుకర్ ఆధ్వర్యంలో వాజేడులోని ఆసుపత్రి ఆవరణలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. తరచు వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలను వినియోగించేలా ప్రజలలో చైతన్యం కలిగించాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టే సమయంలో వ్యాధుల గురించి వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో పల్లెదవాఖాన వైద్యులు జ్ఞానస, వైద్య పర్యవేక్షకులు వెంకటరమణ, కోటిరెడ్డి, వైద్య సహాయకులు చిన్న వెంకటేష్, శేఖర్, వైద్య సిబ్బంది సత్యనాగవేణి, ఛాయాదేవి, లలితకుమారి, కన్యాకుమారి, రాజేశ్వరి ఆశాకార్యకర్తలు ఉన్నారు.

వెంకటాపురం: వెంకటాపురం మండలంలోని ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన సమావేశంలో వైద్యాధికారి, జిల్లా ప్రోగ్రాం అధికారి భవ్యశ్రీ మాట్లాడారు. పల్లెస్థాయిలో కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్న ఆశాలు వైద్యసేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. ఫ్రైడే, డ్రైడేతో పాటు, అసంక్రమిత వ్యాధులు, కాలానుగుణంగా వ్యాపిస్తున్న వ్యాధులపై ఎప్పటికప్పుడు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఆరోగ్య మహిళ క్లినిక్‌ను ఎక్కువ మంది ఉపయోగించుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వైద్యులు స్నేహ, ఆశీశ్, వినయ్, సోహల్, ఎంఎల్‌హెచ్‌పీ మనోహర్, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140
ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

వీధి దీపాల ఏర్పాటు



ములుగు టౌన్, న్యూస్‌టుడే: ములుగు పట్టణంలో శ్రీనివాస కాలనీలో వీధి దీపాలు వెలగకపోవడంతో.. ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసి మాలోత్ ప్రేమ్‌సింగ్ సమస్యను 'మేమున్నాం.. మీకుతోడుగాకు' చెప్పారు. విషయాన్ని పంచాయితీ కార్యదర్శి రఘుకు వివరించడంతో ఆయన స్పందించారు. పంచాయతీ సిబ్బంది చేత వీధి దీపాలను ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించారు.

శ్రమదానంలో యువత భాగస్వాములు కావాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కమలాపురం(మంగపేట), న్యూస్‌టుడే: మండలంలోని కమలాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వచ్ఛతాహీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజలు, యువత భాగస్వామ్యం చేసుకొని శ్రమదానం చేయాలన్నారు. చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం, తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వండి



పాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న నిరుపేదలు

ములుగు, న్యూస్‌టుడే: అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ ప్రజా సంఘాల ఐకాస ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పాలనాధికారి టీఎస్.దివాకరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐకాస ఛైర్మన్ ముంజాల భిక్షపతి మాట్లాడుతూ.. ములుగు పట్టణంలో నిరుపేదలు 30 ఏళ్లుగా అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇంటి అద్దె చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల కిందట రెండు పడకగదుల ఇళ్లు వంద మంజూరయ్యాయని, అవి ఇప్పటివరకు పూర్తి కాలేదన్నారు. 35 ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ, ఎవరికీ కేటాయించలేదని తెలిపారు. పూర్తయిన వాటిని వెంటనే కేటాయించాలని కోరారు.

కమ్యూనిటీ హాలు నిర్మించాలి

ములుగు: ములుగు జిల్లా కుమ్మర సంఘానికి కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరుతూ కుమ్మర సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆశాడపు దేవేందర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో కుమ్మరలకు కమ్యూనిటీ హాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కుమ్మర వృత్తిదారులకు ఆర్థిక సాయం అందిస్తే వృద్ధిలోకి వస్తారని పేర్కొన్నారు. నాయకులు కొత్తపల్లి బాబురావు, ఓదెల శరత్, పైడిపాల కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

భూపాలపల్లి, న్యూస్‌టుడే : భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలోని ఆజంనగర్ రోడ్డు మార్గంలో మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనం చెట్టుకు ఢీకొట్టిన సంఘటనలో మహాముత్తారం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన ఐరెడ్డి శ్రావణ్‌రెడ్డి(34) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం శ్రావణ్‌రెడ్డి ద్విచక్రవాహనంపై వచ్చారు. కొత్త దుస్తులు కొనుగోలు చేసుకున్న తర్వాత తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలోనే కమలాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో అతివేగంగా వెళ్తూ వాహనం అదుపుతప్పడంతో చెట్టుకు ఢీకొట్టాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

స్తంభం చుట్టూ పిచ్చిమొక్కలు



ములుగు పట్టణంలోని ఎస్పీ కార్యాలయం వెనకాల ఉన్న కాలనీలోని విద్యుత్తు స్తంభానికి తీగలు అల్లుకున్నాయి. అప్పుడప్పుడు వీస్తున్న గాలులకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు. తీగలు స్తంభానికి ఉన్న వీధి దీపాన్ని చుట్టుముట్టడంతో.. రాత్రిపూట సరిగా వెలుతురు రాకపోవడంతో ఈ ప్రాంతంలో తిరగలేని పరిస్థితి నెలకొంది. విద్యుత్తు అధికారులు, సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, ములుగు టౌన్

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి



ములుగు, న్యూస్‌టుడే: ములుగు మండలం మల్లంపల్లి గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తున్న కార్మికుడు ఇనుముల సాంబయ్య విధి నిర్వహణలో భాగంగా తీవ్రంగా గాయపడ్డాడు, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని యూనియన్ గౌరవ అధ్యక్షుడు అప్పాసోపాక ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సదయ్య, మండల కార్యదర్శి రమేష్, నాయకులు సుధాకర్, ఓదెలు పాల్గొన్నారు.



వెంకటాపూర్ జోహార్ హైస్కూల్‌లో..



వెంకటాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో

ముందస్తు బతుకమ్మ వేడుకలు



వాజేడు ఉన్నత పాఠశాలలో..

రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు.. సంస్కృతీ సంప్రదాయం ఉట్టిపడేలా ముస్తాబైన విద్యార్థులు.. కోలాటం నృత్యాలు.. బతుకమ్మ పాటలతో విద్యార్థినులు సందడి చేశారు. వివిధ రకాలు పూలు తీసుకొచ్చి బతుకమ్మలను పేర్చారు. జిల్లాలో పలు చోట్ల మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయురాళ్లు ఆడిపాడి అలరించారు.
- న్యూస్‌టుడే, యంత్రాంగం



చంద్రుపట్ల పాఠశాలలో చిన్నారులు



ములుగులోని మహర్షి కళాశాలలో..



సెయింట్ ఆంథోనీస్‌లో బతుకమ్మలతో చిన్నారులు



బతుకమ్మలతో వేదవ్యాస ఉన్నత పాఠశాల విద్యార్థులు



మంగపేట మండలం కమలాపురం ఆర్ఎంసీ హైస్కూల్‌లో..

వేడుకలకు ముస్తాబు



చీకుపల్లిలో బతుకమ్మ గద్దెకు రంగులు వేస్తూ..

వాజేడు, న్యూస్‌టుడే: బతుకమ్మ వేడుకలకు గ్రామాల్లో గద్దెలను ముస్తాబు చేస్తున్నారు. బుధవారం నుంచి బతుకమ్మ పండగ ప్రారంభం కానుండగా, బతుకమ్మ గద్దెలకు రంగులు వేసి రంగవల్లులతో తీర్చిదిద్దుతున్నారు. వేడుకలు జరిగే ప్రాంగణాలను అందంగా అలంకరిస్తున్నారు. వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి గ్రామంలో యువతులు రంగవల్లులతో గద్దెను అందంగా తీర్చిదిద్దారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు.

ఆదివాసీ బిడ్డకు ఆర్థిక కష్టాలు



సాత్విక

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం మండలంలోని బూటారం గ్రామానికి చెందిన కుడుముల సాత్విక అనే ఆదివాసీ బిడ్డ ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటాలో సీటు సాధించినా.. ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ విద్యార్థిని ఏటూరునాగారంలోని ఆదివాసీ గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసుకుంది. ఆ తర్వాత భద్రాద్రి జిల్లా భద్రాచలంలో ఇంటర్మీడియట్ చదివింది. నీట్ తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని డీఎంఆర్(డా. పట్నం మహేందర్ రెడ్డి) వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు పొందారు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పని చేస్తుండగా, కనీసం ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్నారు. ఐటీడీఏ పీవో గుర్తించి తన చదువుకు సహకరించాలని విద్యార్థిని సాత్విక కోరారు.

రామాలయ కమిటీ ఛైర్మన్ ఎంపిక



అలువాల శ్రీనివాస్

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ ఛైర్మన్‌గా పట్టణానికి చెందిన అలువాల శ్రీనివాస్ మంగళవారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజల సమక్షంలో ఈ ఎంపిక జరిగింది. ఆలయ అభివృద్ధికి కమిటీ, గ్రామ ప్రజల సాకారంతో అంకితభావంతో కృషి చేస్తానని శ్రీనివాస్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా ధన్నపునేని కిరణ్, చెన్న రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా కత్తెర శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా గడ్డం వినయ్, కోశాధికారిగా తాడూరి దీనబాంధవస్వామి, ప్రచార కార్యదర్శులుగా పెండ్యాల సంతోష్, సహాయ ప్రచార కార్యదర్శులుగా సిసింద్రీ, తదితరులు ఎన్నికయ్యారు.

గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: మండలంలోని పస్రా గ్రామంలో నెలకొన్న సమస్యలన్నింటిని పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గ్రామంలోని అన్నివీధుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఎర్ర కుంట వద్ద ఉన్న చేతిపంపునకు మరమ్మతులు చేయించాలని పంచాయతీ కార్యాలయం ముందు దర్నా నిర్వహించి పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. నిరసనలో పార్టీ మండల కార్యదర్శి తీగల ఆగిరెడ్డి, నాయకులు గొంది రాజేష్, సోమ మల్లారెడ్డి, సప్పిడి ఆదిరెడ్డి, జిట్టబోయిన రమేష్, యానాల ధర్మారెడ్డి, మొగిలి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చరవాణుల్లో కాలక్షేపం చేయొద్దు



ఊరట్టంలో విద్యార్థినులతో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

తాడ్వాయి, న్యూస్‌టుడే: విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని, పోయిన కాలం తిరిగిరాదని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. తాడ్వాయి మండల పరిధిలోని 12 ఉన్నత పాఠశాలల్లోని 1,103 మంది విద్యార్థులకు మంగళవారం ఆయన పోలీసు శాఖ తరుపున జనరల్ నాలెడ్జి పుస్తకాలు అందజేశారు. ఎస్సై, పోలీసులు సుడిగాలి పర్యటన చేసి మండలంలోని కాటాపురం, బీరెల్లి, నార్లాపురం, ఇందిరానగర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, కొడిశాల, తాడ్వాయి, మేడారం, నార్లాపురం, కాల్వపల్లి, బయ్యక్కపేట ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, తాడ్వాయి కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులందరికి పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సెలవుల కోసం ఇళ్లకు వెళ్లే విద్యార్థులు పండగను సంతోషంగా జరుపుకొంటునే పుస్తకాలను కూడా తిరగేయాలని సూచించారు. చరవాణులతో కాలక్షేపం చేయొద్దన్నారు. లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగితే విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కేశవరావు, ప్రధానోపాధ్యాయులు కల్తి శ్రీనివాస్, సాయిబాబా, సుధాకర్, నర్సయ్య, రేవతి తదితరులు పాల్గొన్నారు.

బాలికను గర్భవతిని చేసిన వృద్ధుడు

గీసుకొండ, న్యూస్‌టుడే: అభం శుభం తెలియని పన్నెండేళ్ల బాలికను ఓ వృద్ధుడు గర్భవతిని చేసిన ఉదంతం ఇది. వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో మంగళవారం ఈ దురాగతం వెలుగుచూసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) ఇంటి పక్కనే ఉంటున్న 12 ఏళ్ల బాలికపై కన్నేశాడు. బాలిక తండ్రి కొద్ది రోజుల క్రితం మృతిచెందగా తల్లి ఆమె తన ఇద్దరు కొడుకులను, కూతురు(12)ను వదిలేసి తల్లిగారింటికి వెళ్లిపోయింది. అన్నదమ్ములతో కలిసి ఉంటున్న బాలికపై సాంబయ్య కన్ను పడింది. సోదరులు లేని సమయంలో సాంబయ్య బాలికకు మాయమాటలు చెప్పి ఆమెను లోబరుచుకుని గర్భవతిని చేశాడు. ఇటీవల ఇంటికి వచ్చిన తల్లికి బాలిక ఈ విషయం చెప్పడంతో బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వరంగల్‌లోని సీకేఎం ఆసుపత్రిలో మంగళవారం బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో నాలుగు నెలల గర్భవతని వైద్యులు నిర్ధారించారు. బాలికను వసతి గృహానికి తరలించి పోలీసులు సాంబయ్యపై పోస్కో చట్టం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం



సంక్షిప్తంగా

మంగపేట, న్యూస్‌టుడే: మండలంలోని పొద్మూర్‌కు చెందిన దాగం సత్యం ఇల్లు గత నెలలో వర్షాలకు కూలిపోయింది. మంగళవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం మంగపేట మండల కమిటీ నాయకులు బాధితుడిని పరామర్శించి రూ. 16 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఓదెల శ్రీనువాస్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు దామెరకుంట రవి, మండల మాజీ అధ్యక్షుడు కోడెపాక యాదగిరి, సంఘం సభ్యులు ముక్కెర సంతోష్, దాగం నారాయణ, ముక్కెర లక్ష్మయ్య, అక్కెనపెల్లి రవి, దాగం శ్యాం, అక్కెనపెల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మగూడెం(మంగపేట): మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న మద్దెల పాపారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం సభ్యులు పాపారావు కుటుంబానికి రూ.16 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి మద్దెల అంజయ్య, సభ్యులు రామనాథం, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రాత పుస్తకాల పంపిణీ



ములుగు, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో విద్యార్థులు ఆటపాటలతో పాటు వారి సామర్థ్యాలు పెంపెందించుకోవాలని ఎంఈవో సామల శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ములుగు మండలం మంచినీళ్లపల్లిలో పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయాలను అనుసరిస్తూనే వాటిలో ఉన్న ప్రత్యేకతలను గమనించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.దిలీప్, ఉపాధ్యాయుడు పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు..



ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం పట్టణానికి చెందిన మనం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు చౌలం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వికాస్, తదితరుల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చింతలపాడు గొత్తికోయల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మొత్తం 38 మంది చిన్నారులకు కనీస వసతులు లేవు. వీరి కోసం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో ప్రేమల, సూపర్‌వైజర్ ఆఫ్రిన్, అంగన్‌వాడీ టీచర్ యాలం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

70 మందికి కంటి శస్త్ర చికిత్సలు



చికిత్స చేయించుకున్న వారితో ట్రస్టు అధ్యక్షుడు జంపన్న

ములుగు, న్యూస్‌టుడే: జంపన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ములుగు పట్టణానికి చెందిన 70 మందికి కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారి కోసం హైదరాబాదులోని శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గత ఆదివారం ములుగులో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి పరీక్షలు చేయించి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్నవారిని ప్రత్యేక వాహనం ద్వారా హైదరాబాదు తీసుకెళ్లినట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య జంపన్న వివరించారు. మంగళవారం వారిని తిరిగి ములుగు తీసుకొచ్చారు.

పరామర్శ

నిమ్మగూడెం(మంగపేట), న్యూస్‌టుడే: మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న మద్దెల పాపారావు ఇటీవల అనారోగ్యం మృతి చెందాడు. మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. పాపారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి సహకార సంఘం డైరెక్టర్ కోడెం బాలకృష్ణ, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ కర్రి నాగేంద్రబాబు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మురుకుట్ల నరేందర్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముత్తినేని ఆదినారాయణ, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన పైడాకుల రాజేష్, జాడి రాధిక రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ పర్వతాల కుమారస్వామి తెలిపారు. సెప్టెంబర్ 30న వరంగల్‌లోని పైడిపల్లిలో నిర్వహించిన అండర్-17 బాల, బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 5 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు నుంచి వీరు తలపడనున్నారు.

కవిత్వం పోటీలకు..

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: మండలంలోని చల్వాయి మోడల్ స్కూలు విద్యార్థులు రాష్ట్రస్థాయి కవిత్వం పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో సీహెచ్ శాలిని, పి.వైష్ణవి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులిద్దరిని పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామచందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కేటీపీపీలో నిలిచిన విద్యుదుత్పత్తి

చెల్పూర్(గణపురం), న్యూస్‌టుడే : గణపురం మండలం చెల్పూర్‌లోని కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్(కేటీపీపీ)లో మంగళవారం విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. 500 మెగావాట్ల మొదటి దశ ఉత్పత్తి కేంద్రంలోని బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా ఉత్పత్తి నిలిచిపోయినట్లు తెలిసింది. లీకేజీ సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

గణపురం, న్యూస్‌టుడే : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గణపురం ఎస్సై ఆర్.అశోక్ తెలిపారు. మంగళవారం గణపురం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, మత్తు పదార్థాలతో కలిగే పరిణామాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని.. వాటి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఆపద సమయంలో 100 డయల్ చేయాలని సూచించారు.